# బంజారాహిల్స్‌లో కారు బీభత్సం..



**పంజగుట్ట, ఆగస్టు31 (ప్రభాతవార్త):**
బంజారాహిల్స్‌లో ఓ కారు అతివేగంగా వచ్చి అదుపు తప్పి ఫల్టీలు కొట్టగా, ప్రమాదంలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్2 వ్యాపార సముదాయ భవంతి వద్ద జూబ్లీహి ల్స్ చెక్‌పోస్ట్ నుండి పంజగుట్ట వైపు వెళుతున్న కారు అతివేగంతో ఢీకొని ప్రమాదానికి కారణమైంది. ప్రమాదంలో కారు ఫల్టీలు కొట్టడంతో అక్కడున్న ఓ కారు, ఆటో పూర్తిగా ధ్వంసమయ్యాయి.పాతబస్తీకి చెందిన ఓ ఫ్యామిలీ కారును అద్దెకు తీసుకుని వెళుతున్నారని, కారును నడుపుతున్న మైనర్ బాలుడు ఒక్కసారిగా కారు వేగం పెంచడంతో అదుపుతప్పి కమర్షియల్ కాం ప్లెక్స్‌లోని పార్కింగ్‌లో ఉన్న ఆటో ఇతర వాహనాలను ఢీకొట్టి బోల్తా పడిం ది. కారులో ఉన్న మిగతా కుటుంబ సభ్యులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.కారు నడుపుతున్న మైనర్ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయాలబారిన పడ్డవారిని స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసుకుని బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# హైదరాబాద్ వార్త



# గొలుసు కట్టు చెరువుల గోస-1

## -ఈదుల కుంట ఏది..?
## -హైటెక్‌సిటీ చెంత మరో జలవనరుకు భూసమాధి
## -ఎనిమిదెకరాల కుంటను ఏమార్చిన ఘనుడు
## -చుక్క నీరు చేరకుండా నాలా దారి మళ్లింపు
## -ఆయిల్ ఇంజిన్లతో నీటిని తోడుతూ ఆకాశహర్మ్యాలకు పునాదులు

**సైబరాబాద్ ప్రతినిధి, ఆగస్టు 31 ప్రభాతవార్త**

**హైటెక్‌సిటీ ఎదురుగావుండే తమ్మిడికుంట నుంచి వెలువడే వరదనీరు నేరుగా వెళ్లి చేరేది ఆ కుంటలోకే... అయినా రికార్డులు తిరగేస్తే తప్ప అధికారులకు దాని పేరు తెలియదు అడ్రసు కోసం గాలిస్తే తప్ప దాని ఆనవాళ్లు ఎవరికీ తెలియవు... పచ్చని చెట్లతో అలరారే రెండు అందమైన రాతి కొండల నడుమ కొలువైవున్న ఈ జలవనరుపై కన్నేసిన ఓ భూబకాసురుడు దాని ఆనవాళ్లనే మాయం చేశాడు... కుంటకు ఏదారీ లేని కారణంగా ఎవరూ అటువైపు వెళ్లే అవకాశం లేకపోవడంతో ప్రతినిత్యం కుంటలోకి వచ్చే నీటికి అడ్డంగా పకడ్బందీగా కాంక్రీట్‌వాల్ నిర్మించి చుక్క నీరు చేరకుండా దారిమళ్లించాడు... భారీ కట్టడాల పునాదులకోసం కుంటలోని మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిలువడంతో దాన్ని తోడేందుకు ఏకంగా ఆయిల్ ఇంజన్లను ఏర్పాటు చేశాడు... ఇంత చేస్తున్నా ఇరిగేషన్ అధికారులు నిద్ర నటిస్తు_ండడంతో హైటెక్‌సిటీకి కూతవేటు దూరంలో దాదాపు వెయ్యికోట్ల విలువైన భూబాగం కలిగిన జలవనరుకు శాశ్వత సమాధికట్టాడు... హైటెక్‌సిటీ ఏర్పాటు ద్వారా వచ్చిన అభివృద్ధి శేరిలింగంపల్లిలో గొలుసుకట్టు చెరువుల గోసవోసుకుంటున్న వైనంపై నేటినుంచి ప్రభాతవార్త వరుస కథనాలు...**

శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ సర్వేనెంబరు 7లో ఎనిమిదెకరాల విస్తీర్ణంలో ఈదులకుంట ఉండేది. ఇందులో 6.05ఎకరాల మేర సర్కారు శిఖం భూమిలో ఉండగా మిగతా కుంట పట్టా భూమిలో ఉండేది. పక్కన రెండెకరాలు పట్టాభూమి ఉన్నా అందులో వ్యవసాయం చేసుకోవడం తప్ప ఎలాంటి ఇతర అవసరాలకు ఉపయోగించకూడదనేది ప్రభుత్వ నిబంధన. హైటెక్‌సిటీ ఎదురుగావుండే గురుకుల్ ట్రస్టు భూముల్లో ఉన్న అయ్యప్ప సొసైటీకి ఆనుకొని రెండు చిన్నపాటి కొండల మధ్య ఈ కుంట ఉండడంతో ఇక్కడకు వెళ్లేందుకు సరైన దారి లేకుండా పోయింది. అయితే కుంట పక్కనే ప్రముఖ సినీ హీరో తండ్రి స్టార్ ప్రొడ్యూసర్ పేరిట కొంతకాలం క్రితం ఓ క్రికెట్ స్టేడియం వెలిసింది. సదరు క్రికెట్ స్టేడియానికి ఉన్న మట్టిరోడ్డు తప్ప ఆవల కుంటవద్దకు వెళ్లేందుకు ఎలాంటి రోడ్డు సదుపాయం లేకపోవడం అక్కడికి ఇతరులెవరూ వెళ్లకపోవడమే ఈకుంట కబ్జాకు మార్గం సుగమం చేసింది.
తమ్మిడికుంట నాలా నేరుగా ఈదులకుంటకు హైటెక్‌సిటీ ఎదురుగా వున్న తమ్మిడికుంటలోంచి వెలువడే నీరు మాదాపూర్ యశోద హాస్పిటల్ సమీపంలో హైటెక్‌సిటీ జెఎన్‌టియు రోడ్డు కల్వర్టు ద్వారా అయ్యప్పసొసైటీలోకి చేరి ఆతర్వాత ఈదులకుంటలో కలుస్తుంది. ఇందుకోసం నలభై అడుగుల నాలా ఉండగా అదికూడా మార్గమధ్యలో కబ్జాకు గురైంది. నేరుగా ఈదులకుంటలోకి వెళ్లే ఈనాలాను క్రికెట్‌స్టేడియం దాటడంతోనే చెరబట్టిన బకాసురుడు రెండువైపులా కాంక్రీట్‌వాల్ నిర్మించి చుక్కనీరు కూడా కుంటలోకి వెళ్లకుండా దారిమళ్లించాడు. ఆతర్వాత ఈదులకుంటలోని ఒండ్రు మట్టిని సైతం ఇతర ప్రాంతాలకు తరలించి అక్కడ కుంట ఆనవాళ్లు కూడా లేకుండాచేశాడు. ఇటీవల కురిసిన వర్షానికి ఈదులకుంటలోకి కొంత నీరు వచ్చిచేరగా తాజాగా నీటిని తోడేందుకు భారీ ఆయిల్ ఇంజన్‌ను కూడా ఏర్పాటు చేశాడు.



కుంటలోని నీటిని తోడేందుకు ఆయిల్ ఇంజన్‌ను ఏర్పాటుచేసిన దృశ్యం

### ఎవరీ ఘనుడు...

హైటెక్‌సిటీ ఎదురుగా అత్యంత విలువైన భూబాగంలో ఉన్న ఈదులకుంటను కబ్జాచేసిన వ్యక్తి ఓ ప్రముఖ వ్యాపారవేత్త అని తెలిసింది. విజయవాడకు చెందిన ఈయనకు జాతీయరహదారుల కాంట్రాక్టుల తోపాటు హైదరాబాద్ నగరంలో బడా నిర్మాణ సంస్థ కూడా ఉంది. ఇక్కడ హైరైజ్ అపార్టుమెంట్ల నిర్మాణంకోసమే ఈదులకుంటను చెరబట్టి ఆనవాళ్లు లేకుండా చేస్తున్నాడని స్పష్టమయింది. వ్యాపారాల ద్వారా వేలకోట్లు సంపాదిస్తున్నా పర్యావరణ పరిరక్షణలో ప్రధానపాత్ర పోషిస్తున్న జలవనరులను సైతం మింగేందుకు ఇతగాడు వెనకాడకపోవడం గమనార్హం.

### హైడ్రా అధికారులే రక్షించాలి : శోభన్

ఈదులకుంట కేవలం రెవెన్యూ రికార్డుల్లోనే కనిపిస్తుంది తప్ప అక్కడొక కుంట ఉన్నట్లుగా ఆనవాళ్లు లేకుండా చేశారని శేరిలింగంపల్లి సిపిఎం కార్యదర్శి చల్లా శోభన్ ప్రభాతవార్త ప్రతినిధికి తెలిపారు. ఈదులకుంటను పరిరక్షించేందుకు తాను సమాచార హక్కు చట్టం ద్వారా శేరిలింగంపల్లి మండల రెవెన్యూ కార్యాలయం నుంచి భూరికార్డులను సైతం తీసుకున్నానన్నారు. ఈవిషయాన్ని ప్రభాత వార్త దినపత్రిక ద్వారా వెలుగులోకి తెచ్చి హైడ్రా అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం ద్వారా ఈదులకుంటను రక్షిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

# నగర అభివృద్ధికి పటిష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్దాం

**-అన్నిశాఖలు సమన్వయంతో నే హైదరాబాద్ అభివృద్ధి సాధ్యం**

**-జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట**



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అమ్రపాలి తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 31,ప్రభాతవార్త:**
హైదరాబాద్ నగర అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట అన్నారు. ఈమేరకు శనివారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జిహెచ్ఎంసి, నగర అనుబంధ శాఖలతో సిటీ అభివృద్ధిపై కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ముందుగా సమావేశంలో తీసుకున్న ఎజెండా అంశాలల్లో చేపట్టిన పనులు, పూర్తయినవి, ట్రాఫిక్ సమస్యలు, రోడ్‌సేఫ్టీ, వాటర్‌లాగిన్ పాయింట్స్, ఇరుకుగా ఉన్నరోడ్లకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలు ,ట్రాఫిక్ నియంత్రణకు ఆయా రోడ్ జంక్షన్‌లో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అదేవిధంగా సమావేశంలో తీసుకున్న కొత్త ప్రతిపాదనలకు ప్రణాళికలు చేశారు. సిటీ అభివృద్ధిలో భాగస్వామ్యమైన శాఖలైన ఆర్అండ్‌బి ,మెట్రో,రైల్వే, విద్యుత్ ,జాతీయ రహదారులు, ట్రాఫిక్, వాటర్‌వర్క్స్, హెచ్ఎండీఏ, పోలీస్, ఆర్టీసి, రెవెన్యూ శాఖ అధికారులతో కమిషనర్ ఆయా అంశాలపై సమీక్షించారు. జిహెచ్ఎంసి ప్రగతికి ఆయా శాఖలు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. పలుచోట్ల ఫైఓవర్ నిర్మాణాలు , సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడం, కొత్తరోడ్‌లను అభివృద్ధి చేయడం, జంక్షన్ డెవలప్‌మెంట్ ,ఫ్రీలెఫ్ట్ ,ర్యాంపుల ఏర్పాటు, అండర్ పాస్ నిర్మాణాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్వాహణ , బ్లాక్ పాయింట్స్ గుర్తించి తగిన చర్యలు చేపట్టడం, పలు పనులకు కావాల్సిన పరిపాలన మంజూరి ,విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు తదితరాలపై ఆయా శాఖల అధికారులతో ప్రణాళికలు చేశారు. ఈసందర్భంగా కమిషనర్ అమ్రపాలి మాట్లాడుతూ ..హైదరాబాద్ ఇమేజ్ మరింత పెంచడానికి ,పెద్దఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించి , అంతర్జాతీయ స్థాయికి ఎదిగే విధంగా గ్రేటర్‌లో అభివృద్ధి జరగాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో గ్రేటర్ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. సిటీసమగ్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆమె కోరారు. అంతకు ముందు హైదరాబాద్ ,రాచకొండ ,సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌లు, ట్రాపిక్ సిపి నగరంలోని రోడ్లు జంక్షన్లు, ట్రాఫిక్ సమస్యలకు సంబంధించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించి చేపట్టాల్సిన చర్యలు గురించి సూచించారు. హైదరాబాద్ ,రాచకొండ, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు, ఎస్‌పిడిసిఎల్ సిఎండీ ముషారఫ్ ఫారుఖీ, ట్రాఫిక్ పోలీస్ అడిషనల్ కమిషనర్ విశ్వనాథ్ ప్రసాద్, డెవిడ్, ఈఎన్‌సి జియాఉద్దీన్, జోనల్ కమిషనర్లు , అడిషనల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు

# ఆక్రమణలపై దూకుడు పెంచిన హైడ్రా..

**నిజాంపేట్, ఆగస్ట్ 31, ప్రభాతవార్త**
చెరువు స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా నిర్మించిన నిర్మాణాలపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా దూకుడు పెంచింది. అక్రమ నిర్మాణాలను కూల్చడమే కాకుండా దాని వెనుకల అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తూ దీనికి పూర్తి బాధ్యత ముమ్మాటికీ అధికారులదే అంటూ వారిపై కేసును నమోదు చేసింది. కట్టడాలకు అక్రమంగా అనుమతులు ఇచ్చిన అధికారులను సైతం వీడకుండా హైడ్రా తన అధికారాలను స్వేచ్ఛతో ముందుకెళ్తుంది. దీనిలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు చెరువులో అక్రమ నిర్మాణాలకు అనుమతులు జారీ చేసిన నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ రామకృష్ణతో పాటు, బాచుపల్లి మండల తహసిల్దార్ పూల్‌సింగ్‌లపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఇప్పటివరకు చెరువులను ఆక్రమించిన బడ నేతలతో పాటు కొంతమంది చెరువులను భూ కబ్జాదారులపై కేసులు నమోదయ్యే సంఘటనలు చూసాము తప్పా దానికి భిన్నంగా ప్రస్తుతం తెలంగాణలో హల్చల్ చేస్తున్న హైడ్రా పనితీరుతో ఇప్పుడు అధికారులను సైతం వదలకుండా వారిపై శాఖపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీస్ శాఖలో క్రిమినల్ కేసులు నమోదు చేయడం సంచలనం సృష్టించింది. ఇకపై చెరువులను కబ్జా చేయాలని ఆలోచన లేకుండా పూర్తిగా వాటి సంరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాతో హడల్ సృష్టిస్తోంది. అధికారులపై క్రిమినల్ కేసులతో ఆగకుండా చెరువల్లో అక్రమ నిర్మాణాలను పూర్తిస్థాయిలో కూల్చివేసి భవిష్యత్ తరాలకు చెరువులను అందించాలన్న లక్ష్యంతో హైడ్రా చేస్తున్న పనితీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజలకు ఇబ్బంది కలగకుండా పటిష్టమైన చర్యలు

## న-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్, ఆగస్టు 31,ప్రభాతవార్త:**
రాబోయే రెండురోజులు భారీవర్షాలు పడేఅవకాశం ఉన్నందున వాతావరణవాఖ రెడ్‌అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పటిష్టచర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శనివారం సెక్రటేరియట్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి భారీ వర్షాల నేపథ్యంలో వివిధశాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కదివరన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. టెలికాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో రెండురోజులు భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఏవిధమైన ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్టచర్యలు చేపట్టాలని అదేశించారు. వాతావరణ శాఖ రెడ్‌అలర్ట్ సూచించిన నేపథ్యంలో సోమవారం అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ప్రకటించడం జరిందని తెలిపారు. జిల్లాలో 59పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగా తరలించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, విద్యుత్ , ఆర్‌అండ్‌బి శాఖలతోపాటు జిహెచ్ఎంసి అధికారులు కూడా నిరంతరం విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# పేదప్రజల జోలికి వస్తే ఖబడ్దార్ రేవంత్ రెడ్డి : ఎంపి ఈటల

**అల్వాల్, ఆగస్టు 31 ప్రభాతవార్త:**
పేద మధ్య తరగతి ప్రజలు ఆస్తులు వద్దకు వస్తే ఖబడ్దార్ మిస్టర్ రేవంత్ రెడ్డి అని ఎంపి ఈటెల రాజేందర్ ఘాటుగా హెచ్చరించారు. శనివారం చినరాయుని సమీపంలోని పలు కాలనీ వాసులకు రెవెన్యూ యంత్రాంగం నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో స్థానికంగా ఆయన పర్యటించారు. నోటీసులు ఇచ్చినంత మాత్రాన భయపడాల్సి న అవసరం లేదని ఎంపి ప్రజలకు భరోసా ఇచ్చారు. హైడ్రా పేరుతో నగరంలో డ్రామా నడుస్తోందని ప్రజలు జోలికి వస్తే అడ్డంగా నిలబడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వం అనుమతులుతో ఇళ్ళు నిర్మిం చుకున్న వారికి నోటీసులు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. సంవత్సరాలు కాలంగా నిద్ర పోయిన యంత్రాంగం ఇప్పుడు మేల్కొనడం విచిత్రంగా ఉందని తెలిపారు. బ్యాంకు రుణాలుతో ఇళ్ళు నిర్మిం చుకున్న వారివి కూలుస్తారా అని ప్రశ్నించారు. రాత్రికి రాత్రే హీరోలు కావడానికి ధర్మాన్ని కాపాడు తున్నట్లుగా నాటకాలు ఆడడం మానాలని ఆయన ప్రభుత్వ పెద్దలను హెచ్చిరించారు. సీఎం ఐదు సంవత్సరాలు ఎంపిగా ఉండి ప్రజలకు ఏమి చేశాడని ఈటెల ప్రశ్నించారు. తెలంగాణా ప్రజలు బిక్షతో ముఖ్యమంత్రి అయ్యావనే విషయాన్ని మరువరాదని పేర్కొన్నారు. తప్పులు జరిగితే సరిదిద్దాల్సిన అవసరం ఉందని కనీసం సమయం ఇవ్వకుండా బుల్‌డోజర్లుతో నిర్మాణాలను నేలమట్టం చేసే అధికా రం నీకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ప్రజలు బాగు కోసం ఎంతకైనా వెళతామని అవసరం అయినే ఎవడ్రా అనే దమ్ము తనకు ఉందని ఎంపి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి ఆనంద్‌రావు నగర్, జానకినగర్, వాసవినగర్, భరత్‌నగర్ తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.



కాలనీ వాసులుతో ఎంపి

# నగరంలో భారీ వర్షం

**-బంగాళాఖాతంలో వాయుగుండం -రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు**





**హైదరాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త**
బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. దీనికితోడు మరో రుతుపవన ద్రోణి కూడా ఏర్పడడంతో అంతటా వానలు కురుస్తున్నాయి. రాజధాని నగరంలో ఉదయం నుంచి వర్షాలు పడుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వరద నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం ఉదయం నుంచి ఎడతెరపని ముసురుతో జన జీవనం పూర్తిగా అస్తవ్యస్తం అయ్యింది. పలు ప్రాంతాల్లో రోడ్లపై గుంతల్లో వరద నీరు నిలవడంతో వాహనాలు నిదానంగా వెళ్లడం వల్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది. మ్యాన్‌హోల్ పొంగిపొర్లి మురుగు నీటితో కలిసి దుర్వాసన రావడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు..ఖైరతాబాద్, నాంపల్లి, బేగంపేట, అమీర్‌పేట, జీడిమెట్ల, సూరారం, బాలానగర్, కూకట్‌పల్లి, కూకట్‌పల్లి, అల్విన్‌కాలనీ, హైదర్‌నగర్, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి, బేగంపేట్, సికింద్రాబాద్, ప్యాట్నీ, పారడైజ్, చిలకలగూడ, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, సురారం, సనత్‌నగర్, ఎస్సార్‌నగర్, పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లిహిల్స్, ఫిలింనగర్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్, బోరబండ, నారాయణగూడ, కోఠి, బేగంబజార్, సుల్తాన్‌బజార్, నాంపల్లి, బషీర్‌బాగ్, పంజాగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేట, దోమలగూడ, ట్యాంక్‌బండ్, తార్నాక, బోడుప్పల్, నాచారం, హయత్‌నగర్, ఎల్బీనగర్, అమీర్‌పేట,అంబర్‌పేట, రామంతాపూర్, ఓయూ, నల్లకుంట, బర్కత్‌పుర, హిమాయత్‌నగర్, అబిడ్స్, ముషీరాబాద్, దోమలగూడ, ఆర్టీసిక్రాస్‌రోడ్డు, చంద్రాయణగుట్ట, పాతబస్తీలోని తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. బోయిన్‌పల్లి, మారేడుపల్లి, అల్వాల్, బాలాజీనగర్, ప్యాట్నీ ప్యారడైజ్, బేగంపేట్ ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. కుత్బుల్లాపూర్, చింతల్, గుండ్లపోచంపల్లి,మలక్‌పేట, వనస్థలిపురం, సరూర్‌నగర్, ఎల్బీనగర్, నాగోల్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది.

### గంటల కొద్ది రోడ్లపైనే వాహనాలు..

వర్షానికి పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఖైరతాబాద్ మీదుగా కోఠి వెళ్లే రోడ్‌లో వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. అమీర్‌పేట నుంచి మాదాపూర్ వెళ్లే మార్గంతో పాటు పంజాగుట్ట నుంచి కొండాపూర్ రోడ్డు, సికింద్రాబాద్ నుంచి జూబ్లీహిల్స్, మాదాపూర్ మీదుగా హైటెక్‌సిటీ వెళ్లే రోడ్డు మొత్తం వాహనాలతో బ్లాక్ అయింది. జేఎన్టీయూ నుంచి హైటెక్‌సిటీ మార్గంలో భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. ఒక్కో వెహికిల్ ఇంటికి చేరడానికి కనీసం గంట సమయం పట్టింది. ట్రాఫిక్ పోలీసులు ఉన్నా..అనూహ్యంగా పెరిగిన వాహనాల రద్దీతో ఏం చేయలేకపోయారు.నగరంలో ప్రధానరోడ్లు లింగంపల్లి నుంచి ఖైరతాబాద్, సికింద్రాబాద్ నుంచి హైటెక్ సిటీ వరకు, హబ్సిగూడ-నాచారం, ఉప్పల్-మేడిపల్లి..వరంగల్ జాతీయ రహదారిలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

**అత్యవసరమైతేనే బయటకు రండి:** వాతావరణ శాఖ హెచ్చరిక

హైదరాబాద్‌కు వాతావరణ శాఖ బిగ్ అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాల నేపథ్యంలో నగరవాసులు అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించింది. లోతట్టు ప్రాంతాలను ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధిత శాఖ అధికారులను అప్రమత్తం చేసింది. వర్షం వల్ల ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని సూచించింది. వర్షం పడే సమయంలో ఇంట్లోనే ఉండాలని, తప్పదనుకుంటే బయటకు వెళ్లాలని పేర్కొంది.

# ఆకట్టుకున్న గ్రాండ్ నర్సరీ మేళా





**హైదరాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త**
వర్షంలోనూ ప్రకృతి ప్రియులు మొక్కలు తీసుకోవడానికి నెక్లెస్‌రోడ్ పీపుల్స్ ప్లాజాకు పరుగులు తీశారు. శనివారం అంతా ముసురుతో ఒకవైపు వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా నర్సరీ మేళాకు వచ్చి తమకు కావాల్సిన మొక్కలు తీసుకువెళ్లారు. మొక్కలు పెంచడం అంటే భావితరాలకు మంచి భవిష్యత్తు అందించడమేనని, ప్రకృతిని ప్రేమించడమంటే కొంగొత్త సమాజాన్ని ప్రేమించడమేనని పర్యావరణ ప్రేమికులు స్పష్టం చేశారు. గురువారం నెక్లెస్‌రోడ్ పీపుల్స్‌ప్లాజాలో ప్రారంభమైన ఆలిండియా హార్టికల్చర్, అగ్రికల్చర్‌షోకు నగర ప్రజలను అమితంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనలో వర్టీకల్ గార్డెనింగ్, హైడ్రోఫోనిక్ సిస్టమ్, టెర్రస్ గార్డెనింగ్ వంటి నూతన టెక్నాలజీ ఈప్రదనలో ప్రత్యేకంగా నిలిచాయి. కిచెన్, అవుట్ డోర్, ఎక్సోటిక్ టిక్, బల్బ్, సీడ్, సీడ్ లింక్స్, ఇండోర్, ఆడినియం, బోన్సాయ్, క్రిపర్స్, ఫ్లవర్స్, ఇంపోర్టెడ్ ప్లాంట్స్ ప్రదర్శించారు. దేశవ్యాప్తంగా డార్జిలింగ్, కోల్కతా, ఢిల్లీ, హర్యానా, ముంబాయి, బెంగుళూరు, పూణే, షిర్డీ, కడియం,చెన్నై, ఆంనరధా తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 150 స్టాల్స్ ప్రదర్శిస్తున్నారు. బోన్సాయ్ వృక్షాలు, పూలు, పండ్ల మొక్కలు అబ్బురపరుస్తున్నాయి.ఈ ప్రదర్శన సోమవారం వరకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని షో ఇంచార్జ్ ఖాలీద్ అహ్మద్ తెలిపారు. ఈ షోలో మెడిసినల్ ప్లాంట్స్, రకరకాల పండ్లు, పూల మొక్కలు, అగ్రికల్చర్, హార్టికల్చర్‌కు అవసరమైన పనిముట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో నర్సరీ స్టాల్స్‌తో పాటు మెడిసినల్ ప్లాంట్స్, ఫ్రూట్స్, ఫ్లవర్ ప్లాంట్స్ ప్రదర్శించారు.

## రాజకీయాలకు అతీతకంగా సనాతన ధర్మాన్ని కాపాడాలి

**అఫ్జల్‌గంజ్, అగస్టు 31ప్రభాతవార్త:** రాజకీయాలకు అతీతకంగా సనాతన ధర్మాన్ని కాపాడాలని ప్రజా ఏక్తా జాతీయఅధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త పిలుపునిచ్చారు. ఈ మేరకు సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో గౌలిగూడలోని ప్రజాఏక్తా కార్యాలయంలో సమితి ట్రస్ట్ ప్రతినిధులు వి.పి సంజయ్, పేం దర్‌గుప్తి, సాయిబాబా, సుమన్‌లుబోనాల శ్రీనివాస్‌గుప్తను కలిసి సన్మానించి అయోధ్య రామున్ని ప్రతిమను అందచేశారు. ఈ కార్యక్రమంలోమావురి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తా

**బేగంబజార్, ఆగస్టు31ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు గాను తెలంగాణ నాన్ గజిటెడ్ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ అన్నారు. పివి నర సింహారావు తెలంగాణ వెటర్నటి యూనివర్సిటి నాన్ టిచింగ్ ఎంప్లాయిస్ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాష్ట్రంలోని పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరి ష్కరించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ల నున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్ హుస్సే నీ, తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, అసోసి యేట్ అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, రంగారెడ్డిజిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మన్, తెలంగాణ నాల్గవ తరగతి సెంట్రల్ అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

## నిర్వాహకులను అభినందించిన మాజీ మంత్రి



విఠలేశ్వర మందిరంలో మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్ పూజలు

**బేగంబజార్, ఆగస్టు31ప్రభాతవార్త:**

ప్రతియేటా మాదిరిగానే ఈసంవత్సరం శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని భాగ్యనగర్ శ్రీకృష్ణజన్మాష్టమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన నిర్వాహకులను మాజీ మంత్రి సి.కృష్ణయాదవవ్ అభినందించారు. ఉస్మాన్‌షాహి విఠలేశ్వర మందిరంలో ఆయన బాలభక్తసమాజ్, విఠలేశ్వర మందరి, ఉత్సవసమితి ప్రతినిధులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ సమితినిర్వాహకులు బోయిని సందీప్ యాదవ్‌ను అభినందించారు. బిజెపినాయకులు గోవింద్‌రాఠి కూడా పూజలు చేశారు. ఈకార్యక్రమంలో బాలభక్తసమాజ్ అధ్యక్షులు వి.కిషన్ యాదవ్, ఆలయ ప్రధాన అర్చకులు రాజుమహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మానియా భవన నిర్మాణ నిర్ణయాన్ని విరమించుకోవాలి

**గోషామహల్, ఆగస్టు31ప్రభాతవార్త:** గోషామహల్ పోలీస్ స్టేడియంలో నిర్మించన తలపెట్టనున్న ఉస్మానియా ఆసుపత్రిని భవన నిర్మాణ నిర్ణయాన్ని విరమించుకోవాలని గోషామహల్ ని యోజకవర్గం బిఆర్‌ఎస్ నాయకులుఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రస్తుతం ఉన్నఉస్మానియా ఆసుపత్రి ఖాళీస్థలంలోనే భవనాన్ని నిర్మించి. నిజాం కాలంలో పురాతన భవనానికి మర మ్మత్తులుచేపట్టి రోగులకు వైద్యసేవలు అందించే విధంగా చూడా లని కోరారు. గోషామహల్ పోలీస్‌స్టేడియం గ్రౌండ్స్ పరిసర ప్రాంతాలల్లో ఇరుకైన రహదారులు ఉన్నట్లు తెలిపారు. పోలీసు స్టేడియం గ్రౌండ్స్‌లో పోలీసు అమరవీరుల స్థూపంకూడా ఉంద న్నారు. నిర్మాణం కోసం స్థూపాన్ని కూడా కూల్చివేస్తార అన్ని ప్రశ్నించారు. ఇప్పుడు ఆసుపత్రి నిర్మాణంచేపట్టడం ద్వారా రోగా లకు గురై అవకాశాలు ఉంటాయి. స్థానికంగా ఉన్న వారికి ఏదైనా పెళ్లిళ్లు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, తక్కువ ధరకు ప్రభుత్వం పోలీసు గ్రౌండ్స్‌కు ఇస్తారన్నారు. గ్రౌండ్స్‌లో ఆసుపత్రి నిర్మాణం చేపట్టం ద్వారా పైపులైన్ల ద్వారా ఇబ్బందులకు గురయ్యే అవకా శాలు ఉన్నట్లు తెలిపారు. సాధారణ సమయంలోనే తరుచుగా మురుగునీటి పైపులైన్ పొంగిపొర్లుతుంటాయని, కలుషీత మంచినీరు సరఫరా అవుతుందన్నారు. ఎంజెమార్కెట్ చౌరస్తా నుంచి, అలాస్కాచౌరస్తా, వైపు నుంచి దారుసలాం వైపు, అలా స్కా చౌరస్తా నుంచి బేగంబజార్ వైపు వాహనాదారులు అనేక ఇబ్బందులకు గురవుతుంటారు. ప్రభుత్వం పోలీసు గ్రౌండ్స్‌లో ఆసుపత్రి నిర్మాణం వెనక్కితీసుకోవాలని సూచించారు. పాత ఆసు పత్రి భవనానికి మరమ్మత్తులు చేయించాలని డిమాండ్ చేశారు.

## అమ్మ వారి ఆశీస్సులు ప్రజలందరిపైన ఉండాలి



,భవానీ నగర్ లో దుర్గాభవాని అమ్మ వారి 13వ వార్షికోత్సవంలో పాల్గొన్న కార్పోరేటర్ ముద్దం.

**బేగంపేట ఆగస్టు 31,ప్రభాతవార్త**

అమ్మ వారి ఆశీస్సులు ప్రజలందరిపైన ఉంచాలని ఓల్డ్‌బోయిన్ పల్లి 119 డివిజన్ కార్పోరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఓల్డ్‌బోయిన్ పల్లి డివిజన్ లోని భవానీ నగర్ లో దుర్గాభవానీ అమ్మ వారి 13వ వార్షికోత్సవ ఉత్సవాలలో కార్పో రేటర్ ముద్దం పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భం గా కార్పోరేటర్ ముద్దం నర్సింహయాదవ్ మాట్లాడుతూ శ్రావణ మాసం లో అమ్మ వారిని మహిళలు కుంకుమార్చనలతో ఎంతో భక్తి శ్రద్దలతో పూజిస్తారని, అమ్మ వారి అనుగ్రహం అందరిపైన ఉంచాలని అమ్మ వారిని కోరుకున్నానన్నారు. అనంతరం అన్నదా న కార్యక్రమాన్ని ముద్దం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ ఛైర్మన్ మన్నె ఉదయ్ యాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కర్రె జంగయ్య, డివిజన్ మహిళా అధ్యక్ష రాలు లలిత, జనరల్ సెక్రటరీ హరినాథ్, కమిటీ సభ్యులు సాయి లు, సుందర్, వెంకటేశం, రమేష్ యాదవ్, సతీష్‌యాదవ్, అంజ య్య, ఈశ్వరమ్మ, సునంద, అర్చన భక్తులు పాల్గొన్నారు.

## పబ్లిక్ స్థలాలలో స్పై కెమెరాలతో అప్రమత్తంగా ఉండాలి

**-చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య**

**చిక్కడపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త:**

షాపింగ్ మాల్స్, వివిధ పబ్లిక్ స్థలాలలో స్పై కెమెరాలతో అప్రమత్తంగా ఉండాలని చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య అన్నారు. శనివారం చిక్కడపల్లిలోని అరోరా డిగ్రీ, పీజీ కళశాలలో విద్యార్థినీ విద్యార్థులకు స్పై కెమెరాలపట్ల అప్రమత్తతపై అవగాహన సదస్సు జరిగింది. ఇన్‌స్పెక్టర్ సీత య్య మాట్లాడుతూ సరికొత్త టెక్నాలజీతో సైబర్ నేరగాళ్ళు మోసాలకు పాల్పడుతుంటారని, విద్యార్థినీ విద్యార్థులు ఎక్కు వగా మొబైల్‌ఫోన్‌లతో కాలయాపన చేయకుండా, ఫోటోలు పంపడం ద్వారా అనవసరంగా చిక్కుల్లో పడతారని, వారిపట్ల అప్రమత్తంగా ఉంఆలన్నారు. గుర్తుతెలియని ఫోన్ నెంబర్లకు స్పందించడం, మొబైల్‌ఫోన్‌లకు వచ్చే అనవసరం లేని లింకు లకు స్పందించడం, బ్యాంకు ఖాతాలతో లింకైన వాటిని లక్ష్యం గా చేసి వారి లింకుల ద్వారా వారి సమాచారాన్ని సేకరించి మోసం చేస్తారని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వ నాథం బులుసు, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్లు పి.చంద్రకళ, పి.పూర్ణచందర్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# 9న ఇందిరాపార్కు వద్ద 'గిరిజన సింహగర్జన"

**హైదరాబాద్ ఆగస్టు 30 ప్రభాతవార్త:** సేవాలాల్ సేనా 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 9న నగరంలోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించబోయే 'గిరిజన సింహగర్జన'ను విజయవంతం చేయాలని సేవాలాల్ సేన వ్యవ స్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్ పిలుపునిచ్చారు. శనివారం బాగ్‌లింగంపల్లి సేవాలాల్ సేన కేంద్ర కార్యాల యంలో 'సింహగర్జన'కు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్క రించి ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా గిరిజనులకు 12శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని, ప్రస్తుతం జీవో 33 ద్వారా అమలవుతున్న పదిశాతం రిజర్వేషన్‌లు కాపాడాలని, ప్రత్యేక ఎస్టీ కమిషన ర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మంత్రి వర్గంలో లంబాఈలకు అవకాశం కల్పించాలని, జీవో నెంబరు 3 స్థానంలో మరో జీవోను తీసుకువచ్చి వందశాతం ఉద్యోగా లను ఏజెన్సీ గిరిజనులకు ఇవ్వాలని, ఏజెన్సీలో మెగా డీఎస్సీ ని ప్రకటించాలని కోరారు. సంత్‌సేవాలా మహారాజ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతి రోజు సెలవు దినంగా ప్రకటించాలని, గిరిజనులకు నామనేటెడ్ పదవుల్లో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.



బాగ్‌లింగంపల్లి సేవాలాల్ సేన కేంద్ర కార్యాలయంలో 'సింహగర్జన'కు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్

ప్రైవేటురంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్‌లు అమలు చేయాలని కోరారు. గుడిసెలు వేసుకున్న లంబాడీలకు ఇళ్ళు నిర్మించి ఇవ్వలని, పెండింగ్ సబ్సిడీ నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ సమావేంలో సేవాలాల్‌సేన రాష్ట్ర కన్వీ నర్ సైదా నాయక్, రమేశ్ మహారాజ్, నగర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్, శంకర్, గణపతి, నవీన్, గోవర్దన్, హంతి రామ్ తదితరులు పాల్గొన్నారు.

## సంజీవయ్య పార్కు వద్ద చిన్నారుల వాక్

**బేగంపేట ఆగస్టు 31,ప్రభాతవార్త**

బాల్య విద్యలో మార్గదర్శకులు, ప్రపంచవ్యాప్తంగా పాఠశాలలు అనుసరించే సూత్రాలకు ఆద్యులైన ఇటాలియన్ వైద్యురాలు, విద్యావేత్త, డాక్టర్ మరియా మాంటిస్సోరి 154వ జయంతి సందర్భంగా శనివారం నెక్లెస్ రోడ్డు ,పీ.వీ.మార్గ్‌లోని సంజీవ య్య పార్కు వద్దకు చిన్నారులు పెద్ద ఎత్తున తరలి వచ్చి వాక్‌ను నిర్వహించారు. మాంటిస్సోరి ట్రెనింగ్ అండ్ రీసెర్చి ట్రస్ట్ సహకారంతో అంథియా మాంటిస్సోరి ఆధ్వర్యంలో ఈ వాక్ ని నిర్వహించారు. ఈ వాక్ లో టీచ్ బై టీచింగ్ నాట్ బై కరెక్టింగ్, శాంతికి విద్య ఓ మంచి ఆయుధం సమాజ అభ్యు న్నతికి చిన్న నాటి విద్య ఓ మంచికీ ఎలా ఆలోచించాలి అని విద్య ఉండాలి కానీ ఏమి ఆలోచించాలని కాదు అని ప్రదర్శిం చే ప్ల కార్డులు పలువురిని ఆకర్షించాయి. ఈ సందర్భంగా అంథి యా మాంటిస్సోరి మాట్లాడుతూ స్త్రీలపై వివక్ష కొనసాగే 19వ శతాబ్దం చివరలో మరియా మాంటిస్సోరి తన పేరును కలిగి ఉన్న విద్యా విధానాన్ని అభివృద్ధి చేసిందని, పిల్లల మేధో సామర్థ్యాలకు అనుగుణంగా విద్యాభ్యాసం చేసే వాతావరణం లో వారు మరింత మెరుగ్గా నేర్చుకుంటారని డాక్టర్ మారియా విశ్వసించేవారన్నారు. ఆమె జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ వాక్ లో నగరంలోని 21పాఠశాలలక చెందిన దాదాపు 900మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన గంగాధర్‌కు సత్కారం



పదవీ విరమణ పొందిన జి.గంగాధర్‌కు జ్ఞాపిక ప్రధానం చేస్తున్న పిసిబి మెంబర్ సెక్రటరీ జి.రవి

**హైదరాబాద్, ఆగస్టు 31 ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ జి.గంగాధర్ శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా సనత్‌నగర్‌లోని పిసిబి ప్రధానకార్యలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పిసిబి మెంబర్ సెక్రటరీ జి.రవి మాట్లాడుతూ గంగాధర్ అందించిన సేవలను కొనియాడారు. గంగాధర్‌లాగా ప్రతి ఒక్కరూ అంకిత భావం, క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. గంగాధర్ తన విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాం క్షించారు. పదవీ విరమణ చేసిన గంగాధర్ మాట్లాడుతూ తన పదవీకాలంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డుతో అనుభవాలను, జ్ఞాపకాలను పంచుకున్నారు. తన హయాంలో సహకరించిన అధికారులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర్‌ను శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్క రించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ బి.రఘు, సీనియర్ సామాజిక శాస్త్రవేత్త డబ్ల్యు.జి.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

### కార్మికులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తా : చంద్రశేఖర్

**నార్సింగి, ఆగస్టు 31 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగిర్ కార్పో రేషన్ పరిధిలోని ఒకటో వార్డులో పని చేసే కార్మికులందరికి అన్ని విధాలుగా అండగా నిలుస్తానని కార్పోరేటర్ తలారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం కార్మికులకు రేయిన్ కోట్, సబ్బులు, నూనెలు, చెప్పులు తదితర వస్తువుల కిట్‌ను పంపి ణీ చేశారు. ఈ సందర్బంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎండ, వాన, చలిలను లెక్క చేయకుండా కార్మికులు శ్రమిస్తుండడం వల్లనే పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. సకాలంలో మంచినీరు, కరెంటు సరఫరా జరుగుతుందన్నారు. కార్మికులు ఒక్క వారం తమ విధులకు దూరంగా ఉంటే మన పరిసరాలన్నీ దుర్గంధంగా మారుతాయని, అంటు వ్యాధులతో మనం అవస్థలపాలవుతామన్నారు. పారిశుద్య కార్మికులను గౌరవంగా చూడాలని తెలిపారు. కార్మికులకు ప్రభుత్వం నుంచి మరిన్ని సౌకార్యలు కల్పించాలని నావంతుగా డిమాండ్ చేస్తు న్నానని చంద్రశేఖర్ వివరించారు.

### వేద ఐఐటి శిక్షణకు ఎంపికైన ఆరుగురు ఎంజిఐటి విద్యార్థులు



వేద ఐఐటి, ఎంబెడ్డెడ్ సిస్టమ్ డిజైన్ శిక్షణకు ఎంపికై ఎంజిఐటి విద్యార్థుల దృశ్యం

**నార్సింగి, ఆగస్టు 31 ప్రభాతవార్త :** గండిపేటలోని ఎంజిఐటి కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు వేద ఐఐటి నిర్వహి సునతన్న ఎల్ఎస్ఐ, ఎంబెడ్డెడ్ సిస్టమ్ డిజైన్ శిక్షణకు ఎంపిక య్యారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సమాయతం చేసే కార్యక్రమంలో భాగంగా జెఎన్‌టియు హైద రాబాద్‌చే ఆమోదింపబడిన వృత్తి పరమైన శిక్షణ కార్యక్రమా నికి రెండు విడుతలుగా నిర్వహించిన పరీక్ష ద్వారా ఎంపిక య్యారు. ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యా ర్థులను సంస్థ ప్రతినిధులు ఎంపిక చేసుకున్నారు. విద్యార్థులు మొదటి సెమిస్టర్‌లో శిక్షణను, రెండవ సెమిస్టర్‌లో ఇంటర్న షిప్‌లలో ఉత్తీర్ణత సాధించి తమ గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేస్తా రు. వేద ఐఐటికి ఎంపికైన ఆరుగురు విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌పి.సింగ్ తదితరులు అభినందించారు.

## అక్రమ నిర్మాణాలపై కొరడా

**నిజాంపేట్, ఆగస్ట్ 31, ప్రభాతవార్త**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబర్ 186, ఇంద్రన్న కాలనీలో గత కొన్ని రోజులుగా అక్రమ నిర్మాణాలను నిర్మిస్తున్న సమాచారం అందుకున్న నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం ఉదయం అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్న ప్రదేశానికి చేరుకొని కొన్ని అక్రమ నిర్మాణాలను తూతూ మంత్రంగా కూల్చివేశారు.

### విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**-చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య**



కార్యక్రమంలో పాల్గొన్న చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య,

**చిక్కడపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త:**

విద్యార్థినీ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యపై దృష్టినిసారించాలని చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య అన్నారు. శనివారం బాగ్‌లిం గంపల్లి వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో న్యూ ఎరా కళాశాల అకాడమి అధినేత డాక్టర్ శ్రీభాష్యం శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే కార్యక్రమంజరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅ తిథిగా ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకుకెళ్లాలని సూచించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు అవసరమైన సలహాలు అందిస్తూ తమ లక్ష్యసాధనకు కృషిచేసే విధంగా దిశానిర్దేశం చేయాలన్నారు. ప్రముఖ చార్టర్డ్ ఎకౌంటెంట్ పి.జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవ ర్చుకోవాలని, కష్టడి కాకుండా ఇష్టపడి చదివి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన నృత్యప్రదర్శనలు అందరిని అలరించాయి.

## తెల్లరేషన్ కార్డు లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణీ పట్ల హర్షం

**చిక్కడపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త:** జనవరి ఒకటవ తేదీ నుంచి తెల్లరేషన్ కార్డు లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల టిపిసి సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం చిక్కడపల్లిలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యంతో పాటు సబ్సిడీపై గోధుమలు పంపిణీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. రేషన్ బియ్యం పక్క దారి పట్టించే వారిపట్ల కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు డీలర్‌షిప్ రద్దుచేయాలని, హాస్టల్స్, స్కూల్స్, ఆంగన్‌వాడీ కేంద్రాలకు అందించే ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు పా టించేలా చర్యలు తీసుకోవడంతో పాటు పేద విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించే కార్యక్రమం కొనసాగుతోందన్నారు.

### సేవా దృక్పథంతో పనిచేసి మంచిపేరు గడించాలి : ఎమ్మెల్యే

**నిజాంపేట్, ఆగస్ట్ 31, ప్రభాతవార్త**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన విష్ డెంట్ డెంటల్ క్లినిక్‌ను శనివారం ఎమ్మె ల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రులు సేవాదృ క్పథంతో మంచి చికిత్సను అందించినప్పుడే సమాజంలో మం చి పేరును గడిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్ బాలాజీ నాయక్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, శివారెడ్డి, దశరథ్, డాక్టర్ విష్ణుప్రియ చెరుకూరి తదితరులు పాల్గొన్నారు.

## చిక్కడపల్లి శ్రీవారి ఆలయాన్ని దర్శించుకున్న అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి



ఆలయాన్ని దర్శించుకున్న అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి

**చిక్కడపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త:**

కలియుగ ప్రత్యక్షదైవం చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుదర్శ న్‌రెడ్డి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయానికి చేరుకున్న సందర్భంగా ఆలయం వ్యవ స్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనే యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలను అందించి వేదపండితుల దివ్య ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రత్యేకతలను, విశేషాలను, ప్రాముఖ్య తను ఈవో రామాంజనేయులు వివరించారు. ఈ కార్యక్రమం లో చిక్కడపల్లి పోలీసుస్టేషన్ అడ్మిన్ ఎస్ఐ నాగరాజు తది తరులు పాల్గొన్నారు.

## చిన్నారునికి ఆర్థిక సాయం అందజేత



**నిజాంపేట్, ఆగస్ట్ 31, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజ కవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్ వాసు లు ధనుంజయ్ కుమారుడు (6) గత కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతు చికిత్స చేయించుకోవడానికి ఆర్థిక స్థోమతలేక శుక్రవారం కత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్‌రెడ్డిని సంప్రదించారు. వెంటనే హన్మంత్‌రెడ్డి స్పందించి తనవంతుగా ఆర్థికసాయం అందిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కెపిహెచ్‌ఆర్ సేవాదళ్ సభ్యులు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తమవంతు సాయం ఈ 9666685869 నంబర్‌కు ఫోన్‌పే ద్వారా సాయం అందించగలరని కోరారు.

# విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు : ఎస్ఈ సోమిరెడ్డి

**చార్మినార్, అగష్టు 31 ప్రభాతవార్త :** పాతబస్తీ వస్త్రాల మార్కెట్లలో వ్యాపారులకు విద్యుత్ సరఫరాకు సంబంధిం చిన సమస్యలు తలెత్తకుండ అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని టిజిఎస్‌పిడిసిఎల్ సౌత్ జోన్ ఎస్ఈ సోమిరెడ్డి తెలిపారు. వస్త్రాల వ్యాపారానికి ప్రసిద్ధి గాంచిన పాతబస్తీ రికాబ్‌గంజ్ లోని వస్త్రాల మార్కెట్లను ఆయన శనివారం సాయంత్రం సందర్శించారు. మార్కెట్లలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలను ఆయన చార్మినార్ డిఇ లింగయ్య గౌడ్, ఎడిఇ విజయ్ కుమార్ కులకర్ణితో కలిసి పరిశీలించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వద్ద కంచె లను ఏర్పాటు చేయాలని, కొన్ని చోట్ల కొత్త విత్యుత్ స్తం భాలను నెల కొల్పాలని ది హైదరాబాద్ కట్ పీస్ క్లాథ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎస్ఈ సోమిరెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత బస్తీలోని వస్త్రాల మార్కెట్లలో విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. అనంత రం ఎస్ఈ సోమిరెడ్డి మదీనా సమీపంలోని చార్మినార్ సెక్షన్ విద్యుత్ కార్యాలయాన్ని సందర్శించి తనిఖీలు చేశా రు. పాతబస్తీకి మొదటి సారి విచ్చేసిన ఎస్ఈ సోమిరెడ్డికి



కార్యక్రమంలో పాల్గొన్న సౌత్ జోన్ ఎస్ఈ సోమిరెడ్డి, చార్మినార్ డిఇ లింగయ్య గౌడ్, చార్మినార్ ఎడిఇ విజయ్ కుమార్ కులకర్ణి,

ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి అభి నందించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు సునీల్ కుమా ర్, శేష్ అగర్వాల్, ఎం.సునీల్ అగర్వాల్, చార్మినార్ డిఇ లింగయ్య గౌడ్, టెక్నికల్ డిఇ మహ్మద్ ఫర్హత్ అలీ, చార్మినార్ ఎడిఇ విజయ్ కుమార్ కులకర్ణి, చార్మినార్ ఎఇ మహ్మద్ జాఫర్, కాంట్రాక్టర్ మహ్మద్ అయూబ్ ఖాన్, మహ్మద్ షకీల్‌తో పాటు పలువురు పాల్గొన్నాం

## బేగంపేట విమానాశ్రయం డైరక్టర్ పి.కె హజారీ పదవీ విరమణ

**బేగంపేట ఆగస్టు 31,ప్రభాతవార్త**

బేగంపేట విమానాశ్రయంలో గడచిన మూడు సంవత్స రాలుగా డైరక్టర్ గా సేవలు అందించిన పీ.కే.హజారీ శనివారం పదవీ విరమణ చేసారు. ఈ సందర్బంగా ఆయన సేవలను కొనియాడుతూ బేగంపేట విమానాశ్రయం ఉద్యో గులు వీడ్కోలు సభ ఏర్పాటు చేసారు. ఈ సందర్బంగా బేగంపేట విమానాశ్రయం నూతనంగా బాధ్యతలు చేపట్టిన వరుదు వి.రావు, మరియూ విమానాశ్రయ ఉద్యోగులు పీ.కే.హజారీ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బేగంపేట విమానాశ్రయం నూతన జనరల్ మేనేజర్, ఎయిర్‌పోర్ట్ డైరక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వరుదు వి.రావు మాట్లా డుతూ బేగంపేట విమానాశ్రయానికి ఎంతో చరిత్ర ఉంద న్నారు. అలాంటి విమానాశ్రయంలో సేవలందించిన పీ.కే. హజారీని తాను అభినందిస్తున్నానన్నారు. ఈ విమానాశ్ర యం వివిఐపీల రాకపోకలతో ఎంతో బిజీగా ఉంటుందని ఇలాంటి చోట బాధ్యతలు నిర్వర్తించడం ఎంతో జాగ్రత్తతో కూడిన అంశమన్నారు. మూడేళ్ల హయాంలో ఉద్యోగులతో సన్నిహిత సంబంధాలు నెరిపి అందరి ఆదరాభిమానాలు చూరగొన్న పీ.కే.హజారీ తన శేషజీవితాన్ని ఆనందంగా



బేగంపేట విమానాశ్రయం డైరక్టర్ గా పదవీ విరమణ చేసిన పీ.కే.హజారీ దంపతులను సన్మానిస్తున్న నూతన డైరక్టర్ వరుదు వి.రావు, ఉద్యోగులు.

గడపాలని తామంతా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని ఆయన అన్నారు. ఈ సందర్బంగా పీ.కే.హజారీ మాట్లాడు తూ బేగంపేట విమానాశ్రయంలో తన సిబ్బంది సహకారం తోనే తాను మూడేళ్ల పాటు సేవలు అందించగలిగాన న్నారు. అందరి సహకారాన్ని తాను గుర్తుంచుకుంటాన న్నారు. తనపై ప్రేమాభిమానాలు చూపిన ప్రతి ఉద్యోగికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వరుదు వి.రావుకు కూడా ఉద్యోగులం తా తమ సహకారాన్ని అందించాలని కోరుతూ అభినందన లు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు గోపకుమార్, కే ఎస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా తెలంగాణ ప్రగతిశీల మహిళా సంఘం ఏడవ రాష్ట్ర మహాసభలు




మహాసభనుద్దేసించి ప్రసంగిస్తున్న ఐఎఫ్‌టియూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ

**ధర్నాచౌక్, ఆగస్ట్ 31, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రగతిశీల మహిళా సంఘం ఏడవ రాష్ట్ర మహాసభలు విజయవం తంగా నిర్వహించారు. శనివారం వివిఎస్టీ నుండడి ఇందిరాపార్కు వరకు భారీ ప్రదర్శనగా కళాకారుల డప్పుల దరువులు, నృత్యాలు, నినాదాలతో కవాతు కొనసాగింది. అనంతరం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో మహాసభ నిర్వ హించారు. ఈ మహాసభకు ముఖ్య అతిధిగా హాజరై ఐఎఫ్ టియూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోనూ దేశంలోనూ మహిళల గొంతు నొక్కే ప్రయ త్నాలు ఈ ప్రభుత్వాలు చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ఆర్ఎస్ఎస్ భావజాలం అయిన మనువాద భావజాలాన్ని దేశంపై రుద్దుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో నిర్భయ హత్యాచారం సందర్భంలో పోరాడి నిర్భయ చట్టం తెచ్చుకున్నప్పటికీ మహిళలపై లైంగిక వేధింపులు ఆగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ మహిళా డాక్టర్ హత్యను కూడా రాజకీ యం చేస్తూ సరైన చర్యలు తీసుకోవటం లేదని ధ్వజమె త్తారు. మహిళలను అణచాలంటే లైంగిక దాడే పరిష్కారం అనే విధంగా పితృస్వామ్యం పెట్రేగిపోతోందని అన్నారు. రైతు చట్టాలను తిప్పి కొట్టాం కానీ నాలుగు కార్మిక చట్టాల తో ఈ ప్రభుత్వం ముందుకు వస్తోందని, దానికి వ్యతిరేకం గా పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మానికి పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.ఝాన్సీ అధ్యక్ష త వహించగా వక్తలుగా ఎం.లక్ష్మి, అందే మంగ, అరుణ ఐఎఫ్‌టియూ నాయకులు జి.అనసూయ, డాక్టర్ పిట్లా సరిత, ఎం.జ్యోతి, పీఓడబ్ల్యూ నాయకులు ఆర్.సీత, జే.హరిత, గీత, ఎన్.కావేరి తదితరులు పాల్గొన్నారు.

## హరికథ తెలుగు భాషకు ప్రాచీన సంపద : డాక్టర్ కె.వి.రమణాచారి

**చిక్కడపల్లి, ఆగస్టు 31 ప్రభాతవార్త:** హరికథ తెలుగు భాషకు మాత్రమే సొంతమైన ప్రాచీన కళా సంపద అని ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో హరికథా పితామహులు, బహుభాషా కోవిదులు ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతోత్సవ కార్యక్రమం గానసభ నిర్వహణలో తెలంగా ణ హరికథా కళాకారుల సంఘం సంయక్త ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కె.వి.రమణాచారి మాట్లాడుతూ ఆదిభట్ల నారాయణదాసు ఆరంభించిన హరికథ మహాగాన యజ్ఞం శతాబ్దిపైగా కొనసాగుతూ ఈనాటికీ ఎందరికో ఆ కళ ఉపాధినిస్తోందన్నారు. నారాయ ణదాసు బహుభాషలలో పండితుడు, సంగీత సాహిత్యాల లో అపార జ్ఞాననిధి అని వివరించారు. హరికథ, బుర్రక థ, నాటకం వంటి ప్రాచీన కళారూపాలను కాపాడుకో వాల్సిన బాధ్యత ఉందన్నారు. గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి మాట్లాడుతూ జానపద, శాస్త్రీయ, కళానరపదర్శనలు ఎవరు నిర్వహించినా 365 రోజులు గానసభలోఇ ఆడిటోరియంలలో సందర్భాన్ని బట్టి



ఆదిభట్ల నారాయణదాసు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డాక్టర్ కె.వి.రమణాచారి, కళావిఎస్.జనార్ధనమూర్తి తదితరులు

ఒకటి ఉచితంగా ఇస్తామన్నారు. కిన్నెర సంస్థస్థాపకులు మద్దాళి రఘురామ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వారం రోజుల పాటు తమ సంస్థ హరికథా సప్తాహం ఇర్వహి స్తున్న విశేషాలు తెలిపారు. అంతకుముందు చిరంజీవా చార్యులు భాగవతార్ 'శ్రీకృష్ణరాయబారం' హరికథాగానం అద్భుతంగా నిర్వహించగా, తారక్ మృదంగంపై, శశిభూష ణ్‌రావు వాయులీనంపై వాద్యసహకారాన్ని అందించారు.

## విద్యార్థులకు విద్య, సంస్కృతి, సాంప్రదాయాలను నేర్పించాలి : ఎంపి విశ్వేశ్వరరెడ్డి



ప్రారంభోత్సవంలో కార్పొరేటర్లు, స్కూల్ యాజమాన్యంతో కలిసి పాల్గొన్న ఎంపి విశ్వేశ్వరరెడ్డి

**గచ్చిబౌలి, ఆగస్టు 31 ప్రభాతవార్త**

విద్యార్థులకు విద్యతో పాటు చిన్నతనం నుంచే సంస్కృతి, సాంప్రదాయాలను నేర్పించి పరిపూర్ణమైన వ్యక్తిగా తీర్చిదిద్దాలని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వరరెడ్డి సూచించారు. ఉపాధ్యాయులు విద్యను వ్యాపారంగా కాకుండా ఓ ఉన్నతమైన సేవగా భావించాలని అభిప్రాయపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని నల్లగండ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్లోసమ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవానికి ఎంపి విశ్వేశ్వరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సమాజానికి విద్యను అందించి చైతన్యవంతం చేయడం గొప్ప విషయమన్నారు. మూస పద్ధతి విద్యా విధానానికి స్వస్తి చెప్పి విద్యార్థుల్లో ఏదైనా సాధించగలం అనే నమ్మకాన్ని కలిగించేలా విద్యాబోధన కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు చదువులో ఉత్తమంగా రాణించి జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకుంటే ఉపాధ్యాయుల కష్టానికి తగిన ఫలితం దక్కుతుందని, విద్య నేర్పిన గురువులకు, చదువుకున్న పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చే విధంగా విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వి.గంగాధర్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, రావుల శేషగిరి, బిజెపి శేరిలింగంపల్లి ఇంచార్జ్ ఎం.రవికుమార్‌యాదవ్, స్కూల్ డైరెక్టర్లు సుచిత, కిరణ్‌కుమార్, పవన్‌లతో పాటు హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్, నాయకులు మిరియాల రాఘవరావు, లక్ష్మీనారాయణరావు, జనార్ధన్‌రెడ్డి, రెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుచితారావు తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి సర్కిల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

**శేరిలింగంపల్లి, అగస్టు 31 ప్రభాతవార్త**

శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటి కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ముకుంద్‌రెడ్డిని పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శేరిలింగంపల్లి డిప్యూటి కమిషనర్‌గా నియమితు లైన సందర్బంగా ముకుంద్‌రెడ్డిని గచ్చిబౌలి కార్పొ రేటర్ గంగాధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పచ్చని మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపా రు. అనంతరం డిప్యూటి కమిషనర్‌తో సమావేశమై గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధిపనులు, పెండింగ్‌లో ఉన్న పలు పనులపై చర్చించారు. ఈ విషయమమై కమిషనర్ ముకుంద్‌రెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలోనే అన్ని శాఖల అధికారులతో గచ్చిబౌలి డివిజన్ సమగ్రాభవృద్ధి కోసం ప్రత్యేకంగా ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకుందామని హామీ ఇచ్చి నట్లు గంగాదర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డిజిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులు హను మంత్ నాయక్, సీనియర్ నాయకులు శేఖర్, రాజు, పల్లపు చంద్రమౌళిజ, సుమన్, మన్నె రమేశ్ తది తరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడా రంగాల్లో ప్రతిభకనబర్చాలి : కొంతం దీపిక

**కంటోన్మెంట్, ఆగస్టు 31 ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుతో పాటుక్రీడా రంగాల్లో ప్రతిభకనబర్చాలని మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక తెలిపారు. గీతాంజలి ఒలింపియాడ్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఇంటర్ స్కూల్ లిటరరీ కాంపిటీషన్ పోటీల వేడుకలకు ఆమె ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. వ్యాసరచన, వకృత్వ, క్విజ్ వంటి పోటీలలో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు దీపిక చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు.

# వినాయక చవితి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ఉమ్మడి, ఆగస్టు 31 (ప్రభాతవార్త) :**



ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో వినాయక చవితి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన వివిధ శాఖల అధికారుల సమన్వయ సమావేశంలో స్థానిక కార్పొరేటర్లు బన్నాల గీతా ప్రవీణ్ బండారు శ్రీవాణి పలువురు అధికారులతో కలిసి మండపనిర్వహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరు సంతోషంగా జరుగుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు మండపాల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. మల్కాజ్గిరి ఏసిపి చక్రపాణి, సిఐ ఎలక్షన్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ లక్ష్మీ మాధవి మాట్లాడుతూ మండపాల వద్ద విధిగా గస్తీ ఉండాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాలకు సంబంధించిన సమాచారం పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని కోరారు. రాత్రి వేళలో మండపాలలోని నిద్రించాలని కోరారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలలో అధ్వానంగా తయారైన రోడ్ల సమస్యలు, వినాయక విగ్రహాలకు అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మలు తొలగించాలని పలువురు సూచించారు. మండపాలకు విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా ఇవ్వాలని, అన్నదానం సమయంలో తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్ గిరి ఏసిపి చక్రపాణి ఉప్పల్ సిఐ ఎలక్షన్ రెడ్డి , ట్రాఫిక్ సిఐ లక్ష్మి మాధవి, మునిసిపల్ ఇంజనీర్ నాగేందర్, తహసిల్దార్ వాణి రెడ్డి, జలమండలి డిజిఎం రజనీకాంత్ రెడ్డి, విద్యుత్ ఏడిఈ బాలకృష్ణ, ఇరిగేషన్ ఎఇ పృథ్వి, హార్టికల్చర్ నర్సింగరావు, ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపకులు ఆకుల మహేందర్, అధ్యక్షుడు జట్ట కిషోర్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు రేవల్లి రాజు, గోనే శ్రీకాంత్, బోరంపేట వంశీ ముదిరాజ్, రామరాజు, కంచర్ల భరత్ రెడ్డి, తిండేరు హనుమంతరావు, శ్రీనివాస్ తెలంగాణ సంపత్ తదితరులు పాల్గొన్నారు. ఉప్పల్ మునిపల్ కార్యాలయంలో ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన వినాయక చవితి మరియు నిమర్జన ఏర్పాట్ల మీద అన్ని శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరు సంతోషంగా జరుగుకోవాలని అన్ని శాఖల అధికారులు అన్ని ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి అని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఏసిపి చక్రపాణి ఉప్పల్ సీఐ ఎలక్షన్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ లక్ష్మి మాధురి ఈఈ నాగేందర్, తహసీల్దార్ వాణి రెడ్డి, కార్పొరేటర్లు బన్నల గీత ప్రవీణ్ ముదిరాజ్, బండారు శ్రీవాణివెంకట్ రావు తదితరులు పాల్గొన్నారు.

## తార్నాక డివిజన్‌లో.. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

**తార్నాక, ఆగస్టు 31 (ప్రభాతవార్త) :**



తెలంగాణ ప్రభుత్వం మహిళా శక్తి పథకంలో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను సికింద్రాబాద్ సర్కిల్ 29 తార్నాక మున్సిఫల్ డివిజన్ లాలాపేటలో ఏర్పాటు చేశారు. దీనిని శనివారం నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాలలో మహిళలను లక్షాధికారులను చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. దీంతో మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించాలనీ ఆకాంక్షించారు. మహిళల స్వయం ఉపాధికి ఈ క్యాంటీన్లు, క్యాటరింగ్ సేవలు ఎంతగానో ఉపయోగపడతా యన్నారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ ఈ క్యాంటీన్‌లో అన్ని రకాలైన టిఫిన్స్, చాయ్, కాఫీ అందుబాటులో ఉంటాయన్నారు. హాస్పిటల్ కు వచ్చే రోగులు, వారి బంధువులతో పాటు అందరికి మార్కెట్ ధరల కంటే తక్కువ కే అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీ పి ఓ శ్రీనాథ్, సీఓ శ్రీవాణి, మహిళా స్వయం సహాయక సంఘాలు, మహిళా సమాఖ్యలు, ఎన్హెచ్ సభ్యులు, ఆర్పిల తో పాటు మల్కరి పద్మ పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను సత్కరించిన రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు

**నేరేడ్‌మెట్, రాచకొండ కమిషనరేట్, ఆగస్టు 31 (ప్రభాతవార్త) :**



రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తూ శనివారం పదవీ విరమణ చేసిన జగన్ మోహన్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్, ఉప్పల్ ట్రాఫిక్, శంబయ్య, సబ్ ఇన్స్పెక్టర్, ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ కరుణాకర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్, ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ అంజయ్య, అసిస్టెంట్ సబ్ ఇనస్పెక్టర్, బొమ్మల రామారం పోలీస్ స్టేషన్, మీరా మోహియుద్దీన్, అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్, ఆర్మ్డ్ హెడ్ క్వార్టర్, అంబర్‌పేట్ మరియు శ్రీ ఆంజనేయులు, ఆర్మ్డ్ హెడ్ కానిస్టేబుల్, ఆర్మ్డ్ హెడ్ క్వార్టర్, భువనగిరి లకు సీపీ సుధీర్ బాబు ఐపిఎస్ రాచకొండ కార్యాలయంలో సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీపీ సుధీర్ బాబు మాట్లాడుతూ ఇన్ని రోజులు పోలీసుశాఖలో సమర్థవంతంగా క్రమశిక్షణతో పనిచేసి సేవలు అందించినందుకు అభినందించారు. వారికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు త్వరగా వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి పి.ఇందిర, డీసీపీ అడ్మిన్, మురళీధర్, డీసీపీ ఏస్ ఓ టి, శ్రీధర్‌రెడ్డి, ఎసిపి స్పెషల్ బ్రాంచ్, సుగుణ, చీఫ్ అకౌంట్స్ అధికారి, పుష్పరాజ్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సీహెచ్ భద్రా రెడ్డి, కార్యదర్శి జి. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నగర్ డివిజన్ భూగర్భ డ్రైనేజీ పనులు పరిష్కరించండి

**జల మండలి జి.ఏం అశోక్ నీ కోరిన కార్పొరేటర్ క్యానము రాజ్యలక్ష్మి**

**నేరేడ్‌మెట్, ఆగస్టు 31 (ప్రభాతవార్త) :**



వినాయక్ నగర్ డివిజన్లో ప్రింటింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ మంచినీటి సరఫరా తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిఎం అశోక్ కుమార్ ను కార్పొరేటర్ క్యానము రాజ్య లక్ష్మి కోరారు. శనివారం జలమండలి జనరల్ మేనేజర్ వి అశోక్ ని సైనిక్ పూరి కార్యాలయములో కలిసి సంవత్సరము కాలం నుంచి భూగర్భ డ్రైనేజీ ప్రపోజల్స్ పిండింగ్లో ఉన్నాయి అని,చాలామంది కాలనీ వాసులు డ్రైనేజీలు పొంగడము వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలియ చేయడం జరుగింది. ఈ ప్రపోజల్స్‌ను ఎక్స్ మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్ రెడ్డికి, మరలా ప్రస్తుత మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డికి కూడా 2 వారాల క్రితం ఇచ్చివచ్చినా ఎటువంటి స్పందన లేనందున, జనరల్ మేనేజర్ ఆయన తరుపునుండి కూడా ఎండీకి ఇక్కడి పరిస్థితి వివరించి, బడ్జట్ అనుమతులు తీసుకొని రావాలని వినయకనగర్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో దీన్దయాల్ కాలనీ వాసులు ఉపేంద్ర, జగదీశ్వర్ పాల్గొన్నారు.

## టౌన్ ప్లానింగ్ అధికారుల ఆయారాం గయారాం

**అక్రమ భవన నిర్మాణంపై చర్యలు చేపట్టని అధికారులు**
**రేకులు తొలగించి చేతులు దులుపుకున్న వైనం**



**ఎల్బీనగర్, ఆగస్టు 31 (ప్రభాతవార్త) :**

విజయవాడ జాతీయ రహదారి పక్కన యథేచ్ఛగా అక్రమ నిర్మాణం జరుగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు కళ్ళు మూసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. రహదారి పక్కన నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం చేపడుతున్నట్లు కాంగ్రెస్, బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలతో పాటు స్థానిక కాలనీవాసులు లిఖిత ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఆయారాం గయారాం అన్నట్లుగా వివరించారు. ఆర్కేపురం డివిజన్ అష్టలక్ష్మి దేవాలయం ఆర్చి పక్కన నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం గురించి స్థానికులు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం టౌన్ ప్లానింగ్ అధికారులు చైతన్యపురి పోలీసు సిబ్బందితో వచ్చి భవనంపైన అదనంగా అక్రమంగా నిర్మాణం చేపట్టిన రేకులషెడ్డు మాత్రమే తొలగించారు. రెండు వైపులా రోడ్లను ఆక్రమించి నిర్మాణం పనులు చేపట్టారని ఫిర్యాదు చేసినప్పటికీ కేవలం రేకులతో పెంట్ హౌస్ నిర్మించిన షెడ్డు రేకులను మాత్రమే తొలగించి చేతులు దులుపుకున్నారని ఫిర్యాదుదారులు అధికారుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తూతూ మంత్రంగా రేకుల షెడ్డును తొలగించి ఆయారామ్ గయారామ్ అన్నట్లుగా అధికారులు వ్యవహరించారని స్థానికులు మండిపడుతున్నారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో పాటు ఇటీవల హైడ్రా ద్వారా చర్యలు చేపడుతున్నప్పటికీ స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు చేతివటానికి అలవాటు పడి అక్రమ భవన నిర్మాణంపై చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జోనల్ కమిషనర్ ఈ అక్రమ భవన నిర్మాణం గురించి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. భవన నిర్మాణదారుడికి వత్తాసు పలుకుతున్న స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడంలో సమర్థవంతంగా పనిచేయాలి






**సుధీర్ బాబు ఐపీఎస్**

**నేరేడ్‌మెట్, రాచకొండ కమిషనరేట్, ఆగస్టు 31 (ప్రభాతవార్త) :**

అక్రమ రవాణాను అడ్డుకోవడం కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని రాచకొండ సిపి సుధీర్ బాబు ఐపీఎస్ అన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగంలో ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్న ఎన్.చంద్రబాబు రాచకొండ పరిధిలో మానవ అక్రమ రవాణా నిరోధం కోసం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా 2024 లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ పనితీరు కనబరచినందుకు, తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్ లో జరిగిన రెండు రోజుల సెమినార్ యందు, మిస్టర్ డి జెలాలం టఫస్సే, చీఫ్ ఆఫ్ ఫీల్డ్ ఆఫీస్, యునిసెఫ్ ఇండియా నుండి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కమీషనర్ సుధీర్ బాబు ఐపిఎస్ నేరెడ్ మెట్ లోని రాచకొండ కార్యాలయంలో ఏ హెచ్ టి యు ఇనస్పెక్టర్ చంద్రబాబును అభినందించారు. మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడం కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని, నూతన విధానాలు అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ఎస్ఓటి మురళీధర్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## త్రిఫ్ట్ పథకంతో చేనేతలకు ఊరట : పున్న గణేష్ నేత

**ఎల్బీనగర్, ఆగస్టు 31 (ప్రభాతవార్త) :**



త్రిఫ్ట్ పథకంతో చేనేత కార్మికులకు ఎంతో ఊరట కలుగుతుందని ఎల్బీనగర్ సర్కిల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పున్న గణేష్ నేత పేర్కొన్నారు. చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూర్చే త్రిఫ్ట్ పథకానికి సంబంధించిన నిధుల విడుదల కోసం ఎదురు చూస్తున్న నేతన్నలకు రూ.90 కోట్ల నిధులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేయడంతో 36,133 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. త్రిఫ్ట్ నిధులు విడుదల చేయడంతో పున్న గణేష్ నేత నేతృత్వంలో చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ని శనివారం సచివాలయంలో శాలువాతో సత్కరించి పుష్పం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ ప్రభుత్వం చేనేత కళాకారుల సమస్యలను పరిష్కరించుటకు సిద్ధంగా ఉందని, నేతన్నల భీమా పథకానికి అవసరమయిన నిధులను కూడా భీమా కంపెనీ వాళ్లకు చెల్లించినదని తెలిపారు. పున్న గణేష్ మాట్లాడుతూ కష్టాలలో నున్న నేతన్నలకు త్రిఫ్ట్ నిధుల విడుదల వలన కొద్దిపాటి ఊరట లభించ గలదని, అందుకు ముఖ్య మంత్రి, చేనేత శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, అధికారులతో అనేక దఫాలు చర్చించిన తెలంగాణ పద్మశాలి సంఘం అధ్యక్షులు కమర్థపు మురళికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బొమ్మ రఘురాం నేత, గుర్రం శ్రావణ్, గడ్డం లక్ష్మీనారాయణ, కౌకుంట్ల రవితేజ, తలాటి రమేష్, జెల్ల సూర్యకాంత్, జెల్ల జగన్నాథం, జెల్ల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మాసాబ్ చెరువును పరిశీలించిన డీసీపీ సునీత రెడ్డి, అధికారులు

**తుర్కయంజాల్, ఆగస్టు 31 (ప్రభాతవార్త) :**



తుర్కయంజాల్ మున్సిపాలిటీలో గణేష్ నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం కాబోతున్న సందర్భంగా డిసిపి సునీత రెడ్డి, ఏసీపీ రాజు, మున్సిపాలిటీ చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రామ్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి, ఎంపీడీవో, సంబంధించిన సిఐలు, ఎస్సైలు, మాసబ్ చెరువులను సందర్శించారు. గణేష్ మండపాల నిర్వహణదారులతో రొక్కం సత్తిరెడ్డి ఫంక్షన్ హాల్ లో మీటింగ్ ఏర్పాటు చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాసాబ్ చెరువు వద్ద జాగ్రత్తలు ఏర్పాటు చేయాల్సిన, ప్రత్యేక క్రేన్లు, జెసిబి లు, లైట్స్, సీసీ కెమెరాలు,ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా డిసిపి సునీత రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె శనివారం మాట్లాడుతూ గణేష్ నవరాత్రులు నిర్వహించే భక్తులకు ముందస్తు జాగ్రత్తలతో గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. ప్రతి ఒక్క గణేష్ మండపం వద్ద ప్రతి ఒక్కరూ సీసీ కెమెరా పెట్టుకోవాలని పోలీస్ డిపార్ట్మెంట్ సూచించిన తగు జాగ్రత్తలు, సూచనలకు అనుగుణంగా గణేష్ మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్త తీసుకుంటూ భక్తి శ్రద్ధలతో గణేష్ నవరాత్రులు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సీఐ రాఘవేందర్ రెడ్డి,ఎస్ రాజు, ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్లు కోసికే ఐలయ్య, రామాత్ కళ్యాణ్ నాయక్, కౌన్సిలర్లు, మర్రి మాధవి మహేందర్ రెడ్డి, మేతరి అనురాధ దర్శన్, మాసబ్ చెరువు పరిరక్షణ సమితి అధ్యక్షులు బచ్చిగళ్ల రమేష్, నిర్వాహకులు, అధికారులు పోలీసులు పాల్గొన్నారు.

## సాయిబాబా దేవాలయం ట్రస్టీగా రాజ్‌కుమార్



**మలక్‌పేట, ఆగస్టు31 (ప్రభాతవార్త) :**

మలక్ పేట మున్సిపల్ కాలనీలోని సాయిబాబా దేవాలయం ట్రస్టీగా ఎం.రాజ్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సాయిబాబా దేవాలయం ట్రస్టీగా తనను నియమించినందుకు దేవాలయం చైర్మన్ రామకోటేశ్వరరావుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేసారు. దేవాలయం ట్రస్టీ గా నియమితులైన రాజ్ కుమార్ ను మలక్ పేట ఉత్సవాలు కమిటీ చైర్మన్ చౌకి రవి కుమార్ శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి గ్రేటర్ కార్యదర్శి చీపురు రాజారావు గౌడ్, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 19వ తేదీన మిలాద్ ఉన్ నబీ ప్రదర్శనలు : హాఫిజ్ ముజఫర్



**మలక్‌పేట, ఆగస్టు 31 (ప్రభాతవార్త) :**

మిలాద్ ఉన్ నబి ప్రదర్శనలు సెప్టెంబర్ 19వ తేదీన నిర్వహించనునట్లు మర్కజి మిలాద్ జులుస్ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ ప్రతినిధులు హాఫిజ్ ముజఫర్ తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేసిన అనంతరం పలువురు మత పెద్దలతో చర్చించి ఏకాభిప్రాయానికి రావడం జరిగిందని తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీన నగరంలో గణేష్ నిమజ్జనం జరుగుతుండడంతో 16వ తేదీన జరగవలసిన మిలాద్ ఉన్ నబి ప్రదర్శనను వాయిదా వేసి సెప్టెంబర్ 19వ తేదీన మిలాద్ ఉన్ నబి ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలు సంవత్సరాల నుంచి మిలాద్ ఉన్ నబి ప్రదర్శనలను నిర్వహిస్తున్నామని ఈనెల 19వ తేదీన కూడా ఘనంగా నిర్వహించనునట్లు తెలిపారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. మక్కా మసీద్ వద్ద ప్రారంభమై చార్మినార్, పత్తర్ ఘట్టి, గుల్జర్ హౌస్ తదితర ప్రాంతాల మీదుగా మొగల్పురా వోల్టా హోటల్ వద్ద ప్రదర్శనలు ముగుస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం

**బీజేపీ నేత మేకల సారంగపాణి**

**తార్నాక, ఆగస్టు 31 (ప్రభాతవార్త) :**



ప్రభుత్వం, పోలీసుల నిర్లక్ష్యంతోనే వరుస రోడ్డు ప్రమాదాలలో విద్యార్థులు చనిపోతున్నారని బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ఆరోపించారు. తార్నాక బిజెపి డివిజన్ అధ్యక్షుడు రాము వర్మ ఆధ్వర్యంలో తార్నాక చౌరస్తాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రమాదాలు నివారించాలంటూ ధర్నా నిర్వహించారు. హబ్సిగూడలో రెండు వారాల్లోనే వరుస రోడ్డు ప్రమాదాలలో పదవ తరగతి విద్యార్థిని సాత్విక, ఆరవ తరగతి విద్యార్తిని కామేశ్వరి ఇద్దరు స్కూల్ విద్యార్థినులు చనిపోవడం చాలా బాధాకరమన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమని ఆయన ఎండగట్టారు. వెంటనే బాధిత విద్యార్థిని కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.పోలీసులకు ప్రభుత్వానికి ట్రాఫిక్ చలాన్ల పై ఉన్న ట్రాఫిక్ నియంత్రణపై లేదని వాపోయారు. వెంటనే ట్రాఫిక్ సిబ్బందిని పెంచి, స్కూల్ సమయాలలో ప్రతి చౌరస్తా దగ్గర తప్పనిసరిగా ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. హబ్సిగూడ చౌరస్తాలో రోడ్డు వెడల్పు చేసి యూ టర్న్ పెట్టాలని లేకపోతే అండర్ గ్రౌండ్ రోడ్డు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల భద్రత కోసం ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన రోడ్లు, చౌరస్తా దగ్గర స్కూల్స్ దగ్గర వాహనాల స్పీడ్ కంట్రోల్ చేయడానికి చిన్న స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలన్నారు.ప్రధాన రోడ్డుల లో స్కూల్స్ దగ్గర ట్రాఫిక్ పోలీసులను నియమించాలన్నారు. రోడ్ల పైన, ఫుట్ పాత్ పైన వ్యాపారులు చేస్తున్న వారి పైన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఫోటోలు తీయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.. తప్ప విద్యార్థులు పాదచారుల ఇబ్బందులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. రాంగ్ రూట్లో వస్తున్న వాహనాల వారిని వెనుక నుండి వాహనాలు ఫోటోలు తీస్తున్నారు తప్ప ప్రమాదాల నివారణ పైన చర్యలు లేవని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు వెంకటేష్ గౌడ్, రవి ప్రసాద్ గౌడ్, వేణు యాదవ్, కనకట్ల హరి, ప్రకాష్ గౌడ్, మలికంటి వీరన్న, శారదా మల్లేష్,సుబ్బారావు, బిక్షపతి యాదవ్, డివిజన్ అధ్యక్షులు అంబాల రాజు, హనుమంతు ముదిరాజ్, ఆకారం రమేష్ ముదిరాజ్, రాజేష్ నాయర్, మద్దర్ల శ్యాంసుందర్,అనిత, సరోజ, ప్రమోద్ కుమార్, రాజు జైన్, జమ్మికుంట వేణు,కృష్ణమూర్తి, సతీష్ రెడ్డి, గోవర్ధన్,దేవుడు కుమార్, ఆర్కాట్ విజయ్ కుమార్, వనమాల శ్రీనివాస్, ఈ ఎల్ ప్రతాప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల నిర్మాణాలు కూల్చవద్దని జోనల్ కమిషనర్‌కు వినతి

**ఉప్పల్, ఆగస్టు 31 (ప్రభాతవార్త) :**



ఉప్పల్ భగాయత్ హెచ్ఎండిఏ లేఅవుట్‌లో పలు చిన్న వ్యాపారస్తుల తాత్కాలిక నిర్మాణాలను కూల్చి వేయవద్దని కోరుతూ ఉప్పల్ బాగాయత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ భగాయత్ అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ జీవో నెంబర్ 33 ప్రకారం కూల్చివేతలపై ఉన్న పునః పరిశీలించాలని కోరారు. గతంలోఉప్పల్ భగయత్ లో హెచ్ఎండిఏ రైతుల దగ్గర నుంచి పొలాలు సేకరించి లేఔట్ గా అభివృద్ధి చేసి రైతులకు కొన్ని ప్లాట్లు కేటాయించారని తెలిపారు. ఆ ప్లాట్ లలో ఇప్పుడే శాశ్వత నిర్మాణాలు చేసుకోవడం కుదరకపోవడంతో కొంతమంది జీవనోపాధి కోసం ప్లాట్ లలో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టి వాటిలో బేకరీ, స్వీట్ హౌస్, రెస్టారెంట్, హోటల్స్, లాంటి చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటున్నారని తెలిపారు. జిహెచ్ఎంసి వారు చిన్నచిన్న వ్యాపారస్తుల తాత్కాలిక నిర్మాణాలను (షెడ్లను) కూలగొట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. జీవో నెంబర్ 33 ప్రకారం గృహ నిర్మాణ స్థలాల్లో తాత్కాలిక నిర్మాణాలు చేసుకుని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాలని దీనిపై పున:పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూదన్ రెడ్డి , ఒక్కంటి శ్రీనివాసరావు, బంగ్లా శ్రీనివాస్ రెడ్డి, గుమ్మిడెల్లి శ్రీనివాస్, బుసిరెడ్డి కృష్ణారెడ్డి, గుమ్మిడెల్లి వెంకటేష్, అజయ్, నరేంద్ర చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## బకాయి ఉన్న రుణమాఫీపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వినతి పత్రం



**తుర్కయంజాల్, ఆగస్టు31(ప్రభాతవార్త) :**

తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూరు క్యాంపు కార్యాలయంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మల్ రెడ్డి రంగారెడ్డితో కలిసి రైతు రుణ మాఫీపై సమీక్షా నిర్వహించిన డిసిసిబి చైర్మన్ (టీఎస్‌సీఏబీ) వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ఇబ్రహీంపట్నం నియోజకవర్గంకి సంబంచిన 9 సొసైటీల (పీఏసీఎస్) సీఈవో హాజరై, బకాయి ఉన్న రుణ మాఫీపై వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగా రెడ్డి అధికారులతో శనివారం మాట్లాడి... ప్రతి అర్హత ఉన్న రైతుకి రుణ మాఫీ అందేలా చూస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతంగా సేవా కార్యక్రమాలు

**పీవీపీ అంజని కుమారి**

**మలక్‌పేట, ఆగస్టు31(ప్రభాతవార్త) :**



సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర సిటీ సివిల్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పీవీపీ అంజనీ కుమారి పేర్కొన్నారు. తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు ముని మనుమరాలు క్రాంతి కృష్ణ స్థాపించిన గిడుగు రామమూర్తి ఫౌండేషన్, కలిమి శ్రీ నవ్యాంధ్ర రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన గిడుగు రామమూర్తి పంతులు భాష పురస్కారాలు 20 24 కార్యక్రమంలో అంజనీకుమారికి నిర్వాహకులు తెలుగు భాష పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో నిరుపేద విద్యార్థులకు, అనాధ విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. తాను చేపడుతున్న సేవా కార్యక్రమాలను గుర్తించి వరుసగా మూడుసార్లు అత్యంత ప్రతిష్టాత్మకమైన గిడుగు రామమూర్తి పురస్కారాలు అందించడం అభినందనీయమని నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. మూడవసారి పురస్కారాన్ని స్వీకరించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, సామాజిక సేవా కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.